సాక్షి అన్నమయ్య జిల్లా

శనివారం, 17, మే, 2025



పట్టుపట్టి... ర్యాంకులు కొట్టి

తల్లిదండ్రుల కష్టాలను చూసిన విద్యార్థులు తమ లక్ష్యం ఎంచుకున్నారు. ఏపీ ఈసెట్ పరీక్ష ఫలితాల్లో ర్యాంకులు సాధించి భళా అనిపించారు. -IIలో



కోడికత్తితో అన్నా వదినలపై దాడి

అన్నదమ్ముల మధ్య వ్యక్తిగత కక్షలు కత్తులతో దాడి చేసుకునే వరకూ దారితీశాయి. సొంత తమ్ముడే అన్నా వదినలపై దాడి చేయడంతో వారు తీవ్రంగా గాయపడ్డారు. -IIలో

మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)

	కనిష్టం	గరిష్టం
మొదటిరకం	రూ.80	రూ.100
రెండోరకం	రూ.60	రూ.70

మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 790 మెట్రిక్ టన్నులు



న్యూస్‌రీల్

21న జెడ్పీ స్థాయీ సంఘ సమావేశాలు

కడప సెవెన్‌రోడ్స్: ఉమ్మడి వైఎస్సార్ జిల్లా పరిషత్ స్థాయీ సంఘ సమావేశాలు ఈ నెల 21న నిర్వహిస్తున్నట్లు జెడ్పీ సీఈఓ ఓబులమ్మ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. కడప జెడ్పీ సమావేశ మందిరంలో ఉదయం 10 గంటలకు ఈ సమావేశాలు ప్రారంభం అవుతాయని ఆమె పేర్కొన్నారు. ఉమ్మడి జిల్లాకు చెందిన జిల్లా పరిషత్ ప్రాదేశిక నియోజకవర్గ సభ్యులు, కడప, అన్నమయ్య జిల్లాల అధికారులు హాజరు కావాలని కోరారు.

20న ఉద్యోగమేళా

రాయచోటి టౌన్: రాజంపేట పాలిటెక్నిక్ కళాశాల ఆవరణలో ఈ నెల 20వ తేదీ ఉదయం 9గంటలకు ఉద్యోగ మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి అధికారి ఏ. సురేష్‌కుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఇందులో హెడీఎఫ్‌సీ బ్యాంక్, జప్టో, టాటా ఏఐఏ, ఎస్‌బీఐ కార్డ్స్, పేటీఎం, సూపర్ కె, ఏఐఎల్ డిక్సన్,మూత్తూట్ ఫైనాన్స్, నియోలైక్, డాయికిన్, యంగ్ ఇండియా వంటి కంపెనీలకు చెందిన ప్రతినిధులు పాల్గొని ఎంపికలు నిర్వహిస్తారని చెప్పారు. 10వ తరగతి, ఇంటర్, డిగ్రీ పాస్ అయిన అభ్యర్థులు పాల్గొనవచ్చన్నారు. మరిన్ని వివరాల కోసం 88977 76368 నంబర్‌లో సంప్రదించాలని పేర్కొన్నారు.

సంగీతంలో గిన్నీస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డులో చోటు



ధ్రువపత్రం అందుకున్న మదనపల్లె వాసులు

మదనపల్లె సిటీ: మదనపల్లె పట్టణానికి చెందిన సీఎస్ఐ జెసీఎం చర్చి ఫాస్టర్ సునీల్‌వరకుమార్ భార్య లూసీమేరి, సభ్యులు కళ్యాణి, ప్రసన్న, రంజితలకు సంగీతంలో గిన్నీస్‌బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డులో చోటు దక్కింది. విజయవాడకు చెందిన హల్లెల్ సంగీత పాఠశాల వ్యవస్థాపకులు పాస్టర్ ఆగస్టీన్ ఆధ్వర్యంలో నిర్వహించిన సంగీత పోటీల్లో పాల్గొన్నారు. 2024 డిసెంబర్ 1న జరిగిన పోటీల్లో 18 దేశాలకు చెందిన 1,090 మంది పాల్గొన్నారు. వీరిలో 1046 మంది గిన్నీస్‌బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డులో స్థానం దక్కించుకున్నారు. పాస్టర్ ఆగస్టీన్ చేతుల మీదుగా ధ్రువపత్రాలు అందుకున్నట్లు చర్చి నిర్వాహకులు తెలిపారు. గిన్నీస్ బుక్ ఆఫ్ రికార్డులో స్థానం సాధించిన వీరిని చర్చి సభ్యులతో పాటు పలువురు అభినందించారు.

పశువైద్య కళాశాలకు వీసీఐ బృందం


ప్రొద్దుటూరు: మండలంలోని గోపవరం గ్రామ సమీపంలో ఉన్న పశువైద్య కళాశాలను వెటర్నరీ కౌన్సిల్ ఆఫ్ ఇండియా (వీసీఐ) బృందం ఈ నెల 14 నుంచి 16వ తేదీ వరకు పరిశీలించింది. వీసీఐ పరిశీలకులు డాక్టర్ విజయ కుమార్, డాక్టర్ సాహత్పురే కళాశాలలోని వివిధ విభాగాలు, పశుచికిత్సాలయం, పశుగణక్షేత్ర సముదాయాలు, విద్యార్థుల వసతి గృహాలు, క్రీడా విభాగాలను క్షుణ్ణంగా పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా బోధన, బోధనేతర సిబ్బంది, విద్యార్థులతో సమావేశమై వారి అభిప్రాయాలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో శ్రీవెంకటేశ్వర పశువైద్య విశ్వవిద్యాలయం కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్ డాక్టర్ వి.చెంగల్వరాయులు, కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ సీహెచ్ శ్రీనివాస ప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారు.

హంద్రీ- నీవా లైనింగ్ పనులను వేగవంతం చేయాలి



దొమ్మన్నబావి వద్ద అధికారులతో సమీక్షిస్తున్న మంత్రి నిమ్మల రామానాయుడు

కురబలకోట: ఇప్పటి వరకు నెమ్మదిగా సాగుతున్న హంద్రీ–నీవా లైనింగ్ పనులను వేగవంతం చేసి నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఆయన అన్నమయ్య జిల్లా కురబలకోట మండలంలోని దొమ్మన్నబావి వద్ద హెచ్‌ఎన్ఎస్ కాలువ లైనింగ్ పనులను పరిశీలించారు. షార్ట్ క్రీటింగ్ మిషన్ పనితీరును కూడా గమనించారు. అనంతరం ఆయన అధికారులతో సమావేశమై పనుల పురోగతిపై సమీక్షించారు.అనంతరం మాట్లాడుతూ పుంగనూరు కాలువ లైనింగ్ పనులను జూలై 10లోగా పూర్తి చేయాలన్నారు. పనులు నాణ్యతగా సాగించాలన్నారు. నాణ్యత లోపిస్తే ఉపేక్షించేది లేదన్నారు. ఈ సందర్భంగా తెట్టు గ్రామంలో సమ్మర్ స్టోరేజ్ ట్యాంక్ నిర్మించాలని గ్రామస్తులు మంత్రికి విన్నవించారు. ఇంజినీర్ ఇన్‌చీఫ్ వెంకటేశ్వర రావు, చీఫ్ ఇంజినీర్ వరప్రసాద్, ఎస్ఇ విఠల్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



● పెద్దాయనపై కక్ష..

అన్నదాతలకు శిక్ష

- రూ.2,144 కోట్లతో ముదివేడు, నేతికుంటపల్లె, ఆవులపల్లె రిజర్వాయర్లు చేపట్టిన వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం
- హంద్రీ-నీవా ప్రాజెక్టులోనే ఆవులపల్లె అతిపెద్ద రిజర్వాయర్
- టీడీపీకి మనుగడ ఉండదన్న కక్షతో పార్టీ నేతలతో ఎన్జీటీలో కేసు
- అర్ధంతరంగా ఆగిపోయిన పనులు
- రూ.800 కోట్లు పనులకు బిల్లులు ఇవ్వలేదు
- పనులు ఆపే ఉద్దేశంతో విజిలెన్స్ విచారణ పేరుతో కొత్త నాటకం



ఆగిపోయిన ముదివేడు రిజర్వాయర్ పనులు (ఫైల్)

మదనపల్లె: కరువు రైతులకు సాగునీటి కష్టాలు తీర్చి, ప్రజలకు తాగునీటి ఇబ్బందులను దూరం చేయాలన్న లక్ష్యంతో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ఎంపీ మిథున్ రెడ్డి, ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి కృషితో మంజూరైన ముదివేడు, నేతికుంటపల్లె, ఆవులపల్లె రిజర్వాయర్లపై టీడీపీ ఆదినుంచి కక్ష కట్టింది. ప్రజలు, రైతులకు మంచి జరిగితే భరించలేకపోతోంది. ప్రాజెక్టులతో అభివృద్ధికి కృషి చేయడమే నేరంగా చూస్తోంది. హంద్రీ–నీవా ప్రాజెక్టు ద్వారా కృష్ణా జలాలను తరలించి కరువునేలను సస్యశ్యామలం చేయాలన్న లక్ష్యాన్ని ప్రతిపక్షంలో ఉండగా అడుగడుగునా అడ్డంకులతో ఎన్జీటీ కేసుతో అడ్డుకున్న టీడీపీ..ఇప్పుడు ఆధికారంలోకి రాగానే విజిలెన్స్ విచారణతో రిజర్వాయర్లను మట్టిలో కలిపేసే కుట్రలు చేస్తోంది. చేసిన పనులకు రూ.800 కోట్ల బిల్లులు చెల్లించాల్సి ఉండటంతో ఇప్పుడు ఈ బిల్లులను అడ్డుకునే కుట్రలో భాగంగా విజిలెన్స్ విచారణ పేరుతో కొత్త నాటకానికి తెరతీసింది. ఈ ప్రాజెక్టులో పనిచేసిన సిబ్బందిని, రికార్డులను పరిశీల చేపట్టింది. హంద్రీ–నీవా ప్రాజెక్టులో అతిపెద్ద రిజర్వాయర్ ఆవులపల్లె కావడం, ఈ మూడింటి పనులు పూర్తయితే ఉమ్మడిజిల్లాలో పెద్దాయన పేరు చిరస్థాయిగా నిలిచిపోతుందన్న అక్కసు, భవిష్యత్‌లో టీడీపీ మనుగడ కష్టమని భావించి పనులు పూర్తిగా ఆపివేసే కుట్రలకు సిద్ధమైంది.

రూ.800 కోట్లు పెండింగ్: ఈ మూడు రిజర్వాయర్లకు సంబంధించి పనులు నిలిపివేసిన 2023 మే 11 నాటికి ముదివేడు రిజర్వాయర్ 33శాతం, నేతికుంటపల్లె 86శాతం, ఆవులపల్లె 5.8 శాతం పనులు జరిగాయి. మొత్తం టెండర్ వ్యయంలో జరిగిన పని విలువ రూ.800 కోట్లకుపైనే. అయితే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో చెల్లించింది రూ.30 కోట్లని సమాచారం. ప్రస్తుత ప్రభుత్వంలో పైసా బిల్లు ఇవ్వలేదు. పైగా చేసిన పనులకు రూ.800 కోట్ల వరకు ప్రభుత్వం బిల్లులను చెల్లించాల్సి వస్తుంది. అయితే ఇప్పుడు ఈ బిల్లుల చెల్లింపు వ్యవహారం ముందు వస్తుందని, దీనిని అడ్డుకోవడం, మరోవైపు రిజర్వాయర్లకు శాశ్వత సమాధి కట్టడం కోసం కూటమి ప్రభుత్వం పెద్దాయనపై కక్షతో కరువు రైతులను శిక్షిస్తోంది. చేసిన బిల్లుల చెల్లింపుపై ఊసెత్తని ప్రభుత్వం రంధ్రాన్వేషణ చేసి కక్షసాధింపులకు పాల్పడుతోంది.

టెండర్‌లో రూ.64 కోట్ల ఆదా

మూడు బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ల నిర్మాణాలకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రూ.2,144.50 కోట్లు మంజూరు చేయగా టెండర్ల నుంచి ఒప్పందం వరకు అన్ని పారదర్శకంగానే జరిగాయి. ఇందులో నిర్మాణాలకు రూ.1,529.37 కోట్లు, భూసేకరణ,ఇతర పనులకు రూ.615.13కోట్లు కేటాయించారు. మూడు రిజర్వాయర్లను ఒకేపనిగా రూ.1,554,21,60,649 అంచనా వ్యయంతో నిర్వహించిన టెండర్లలో ఎన్‌ఈసీఎల్, ఆర్‌ఆర్‌సీఐపీఎల్ జాయింట్ వెంచర్, మేఘా ఇంజనీరింగ్ వర్క్, హెఈఎస్ ఇన్‌ఫ్రా ప్రైవేట్ లిమిటెడ్ సంస్థలు పాల్గొన్నాయి. అంచనా కంటే అధికంగా రూ.1,618.72 కోట్లకు టెండర్లు వేయగా, దీనిపై ప్రభుత్వం రివర్స్ టెండర్ నిర్వహించగా జాయింట్ వెంచర్ సంస్థ రూ.1,553.96 కోట్లతో టెండర్ వేయడంతో ప్రభుత్వానికి రూ.64.76 కోట్ల ఆదా అయ్యింది. అంటే టెండర్ నిర్వహణ పారదర్శకంగానే జరిగింది. ఇందులో పొరబాట్లకు చోటులేదు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో వందకోట్లు దాటిన పనులకు జ్యుడిషియల్ రివ్యూ అనుమతులు వచ్చాకే కాంట్రాక్టర్‌తో ఒప్పందం జరిగింది.

అప్పుడు ఎన్జీటీతో..ఇప్పుడు విజిలెన్స్‌తో

మూడు రిజర్వాయర్ల నిర్మాణ పనులు మొదలయ్యాక టీడీపీ నేతలు అడ్డంకులు సృష్టించడం మొదలైంది. ఎన్జీటీలో కేసువేసి పనులు నిలిపివేయించారు. 2023 ఆగస్టు 4న ప్రాజెక్టుల సందర్శన పేరుతో అంగళ్లుకు వచ్చిన చంద్రబాబుకు వినతిపత్రం ఇవ్వాలని ప్రయత్నించిన వారిపై టీడీపీ శ్రేణులు దాడులు చేశాయి. ఇప్పుడు అధికారంలోకి రావడంతో విజిలెన్స్ విచారణ పేరుతో రిజర్వాయర్లకు సమాధి కట్టి కరువు రైతాంగానికి ప్రాజెక్టుల ఫలాలు అందడకుండా చేసే ప్రయత్నాలు మొదలయ్యాయి. శుక్రవారం మదనపల్లె, తంబళ్లపల్లెల్లో పర్యటించిన జలవనరులశాఖ మంత్రి నిమ్మల రామానాయుడు ఈ రిజర్వాయర్లను ఉద్దేశించి చేసిన ఆరోపణలు చూస్తుంటే..వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో పెద్దాయన చేపట్టిన అభివృద్ధిపై ఎంతటి కక్ష సాధింపులకు పాల్పడుతోందో స్పష్టం అవుతోంది.

» సాగునీరు అందించడం తప్పా

మూడు రిజర్వాయర్ల ద్వారా 1.10 లక్షల ఎకరాలకు సాగునీరు అందించాలన్న మహత్తర లక్ష్యం తప్పా అని రైతాంగం ప్రశ్నిస్తోంది. సాగునీటి రంగంలో దశాబ్దాలుగా వెనుకబడిన తంబళ్లపల్లె, పుంగనూరు నియోజకవర్గాల్లో రైతుల సంక్షేమానికి పెద్దాయన పెద్దపీట వేయడం నేరమా అని నిలదీస్తున్నారు. ఉమ్మడి చిత్తూరుజిల్లా రాజకీయాల్లో పెద్దాయనను ఎదుర్కొనే వ్యూహం లేని టీడీపీ ఆయన చేపట్టిన అభివృద్ధిపై ఇలా అక్కసు వెళ్లగక్కడంపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ప్రస్తుత ఈ రిజర్వాయర్ల పరిస్థితిపై రైతాంగం ఆందోళన వ్యక్తం చేస్తోంది. ఈపాటికే పూర్తి కావాల్సిన పనులను అడ్డుకుని నిలిపివేయడంపై నిరసన వ్యక్తం చేస్తున్నారు.

» అతిపెద్ద రిజర్వాయర్ ఆవులపల్లె

ఆసియా ఖండంలో అతిపెద్ద, 31 ఎత్తిపోతలు కలిగిన ప్రాజెక్టు హంద్రీ-నీవా. ఈ ప్రాజెక్టులో అతిపెద్ద రిజర్వాయర్ చిత్తూరుజిల్లా పుంగనూరు నియోజకవర్గం సోమల మండలంలో ఆవులపల్లె, 3.5 టీఎంసీల నీటినిల్వ సామర్థ్యంతో చేపట్టిన ఈ రిజర్వాయర్ కింద 20వేల ఎకరాల ఆయకట్టును స్థిరీకరించి, కొత్తగా 40 వేల ఎకరాలకు సాగునీరు అందించాలన్నది లక్ష్యం. ఇంత గొప్ప రిజర్వాయర్ నిర్మాణం చేపట్టలేని టీడీపీ..వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో చేపట్టడం జీర్ణించుకోలేకపోతోంది. ఇదేకాక కరువుకు కేరాఫ్ అయిన అన్నమయ్యజిల్లా తంబళ్లపల్లె నియోజకవర్గంలో 120 చెరువులకు నీటిని అందించి 15వేల ఎకరాల ఆయకట్టును స్థిరీకరించి కొత్తగా 20వేల ఎకరాలను సాగులోకి తేవాలని లక్ష్యంతో రెండు టీఎంసీల సామర్థ్యంతో ముదివేడు రిజర్వాయర్ పనులు చేపట్టారు. చిత్తూరుజిల్లా పుంగనూరు మండలంలో ఒక టీఎంసీ సామర్థ్యంతో నేతికుంటపల్లె రిజర్వాయర్ నిర్మాణం చేపట్టి దీనికింద 5వేల ఎకరాల ఆయకట్టును స్థిరీకరించి, కొత్తగా 10వేల ఎకరాలకు సాగునీరు ఇవ్వాలని లక్ష్యం. ఈ పనులు పూర్తయితే వీటిని నిర్మాణం కోసం కృషి చేసిన పెద్దాయన పేరు చిరస్థాయిగా నిలిచిపోతుంది. తద్వారా కరువు రైతుల జీవితాల్లో మార్పు వచ్చి ఆర్థికంగా స్థితిమంతులవుతారు. దీంతో వైఎస్సార్‌సీపీకి ప్రజల్లో మరింత ఆదరణ పెరగడం తథ్యం. ఇదే జరిగితే ఈ రెండు నియోజకవర్గాల్లో టీడీపీ మనుగడ ప్రశ్నార్థకం అవుతుంది. దీనిని జీర్ణించుకోలేని టీడీపీ కుట్రలకు తెరతీసింది.



ఆగిపోయిన ఆవులపల్లె రిజర్వాయర్ పనులు (ఫైల్)

‘స్వర్ణాంధ్ర, స్వచ్ఛాంధ్ర’ పకడ్బందీగా నిర్వహించాలి

జిల్లా కలెక్టర్ ఛామకూరి శ్రీధర్

రాయచోటి: 17న స్వర్ణాంధ్ర, స్వచ్ఛాంధ్ర కార్యక్రమాలను పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ ఛామకూరి శ్రీధర్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం రాయచోటి కలెక్టరేట్‌లోని మినీ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి ప్రతి నెల మూడో శనివారం నిర్వహించాల్సిన స్వర్ణాంధ్ర, స్వచ్ఛాంధ్ర కార్యక్రమాల నిర్వహణ, తాగునీరు, ఉపాధి హామీ, పల్లె పండుగ పనుల ప్రగతిపై అధికారులతో వీసీ నిర్వహించారు. జిల్లాను చెత్త రహితంగా రూపొందించేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ అన్నారు.

- ప్రభుత్వం బదిలీలకు సంబంధించి జారీ చేసిన ఉత్తర్వులల్లో మార్గదర్శకాల మేరకు పారదర్శకంగా బదిలీలు చేపట్టాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు.
- జిల్లాలో తాగునీటి ఎద్దడి ఎక్కడా రానివ్వకుండా చర్యలు చేపట్టాలని తెలిపారు. నీటి కొరత సమస్యను ముందుగానే గుర్తించి అవసరమైన ప్రతిచోట ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేయాలన్నారు.
- ఉపాధిహామి పనులను కూడా పటిష్టంగా అమలు చేయాలన్నారు. లేబర్ మొబిలైజేషన్‌లో భాగంగా ప్రతి కుటుంబానికి వందరోజుల పని తప్పనిసరిగా కల్పించాలన్నారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ ఆదర్శ్‌రాజేంద్రన్, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ శ్రీధర్

వ్యాసరచనతో పిల్లలలో సృజనాత్మకత

వ్యాసరచన వల్ల పిల్లల్లో సృజనాత్మకత, సమాజంపట్ల అవగాహన పెంపొందుతుందని జిల్లా కలెక్టర్ ఛామకూరి శ్రీధర్ పేర్కొన్నారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని తన ఛాంబర్‌లో జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో స్వర్ణాంధ్ర, స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా బీట్ ద హీట్ అనే అంశంపై నిర్వహించిన వ్యాసరచన, చిత్రలేఖనం పోటీల్లో విజేతలకు కలెక్టర్ సర్టిఫికెట్లు, మెమెంటోలను, పాఠ్యపుస్తకాలను అందజేశారు. పోటీల్లో పాల్గొన్న విద్యార్థులకు శుభాకాంక్షలు తెలిపారు. జిల్లా కలెక్టర్ వారి ఆదేశాల మేరకు ఈనెల 15న పోటీలు నిర్వహించామని జిల్లా విద్యాశాఖాధికారి సుబ్రమణ్యం తెలిపారు. వ్యాసరచనలో ఐదుగురికి, చిత్రలేఖనంలో ఐదుగురికిబహుమతులు అందజేసినట్లు చెప్పారు. వ్యాసరచన పోటీల్లో రాయచోటి జెడ్పీహెచ్ఎస్‌కు చెందిన నికిత రెడ్డి, చిత్రలేఖనంలో రాయచోటి జడ్పీహెచ్‌ఎస్‌కు చెందిన భవ్య ప్రథమ బహుమతులు సాధించారని తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ డీఈఓ శివప్రకాష్ రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

గస్తీ విధులు పటిష్టం చేయాలి

ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు

చిన్నమండెం: రాత్రివేళల్లో గస్తీ విధులు పటిష్టం చేసి నేర నియంత్రణ చర్యలు చేపట్టాలని జిల్లా ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు పోలీసు అధికారులను ఆదేశించారు. శుక్రవారం చిన్నమండెం పోలీస్‌స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా స్టేషన్‌లో రికార్డులను పరిశీలించారు.అనంతరం ఎస్పీ మాట్లాడుతూ మహిళల సమస్యలకు ప్రాధాన్యత ఇవ్వాలని, పరిష్కార దిశగా చర్యలు చేపట్టాలని సూచించారు. పెండింగ్ కేసుల సీడీ ఫైళ్లను పరిశీలించి, వాటి దర్యాప్తు, పురోగతిపై ఆరా తీశారు. రౌడీషీటర్లు, చెడు నడవడిక కలిగిన వ్యక్తులపై, పాత నేరస్తులపై ప్రత్యేక నిఘా ఉంచాలన్నారు. సమస్యాత్మక గ్రామాలపై దృష్టి సారించాలని, గ్రామస్తులతో మమేకమై శాంతిభద్రతల సమస్యలు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. విజిబుల్ పోలీసింగ్‌లో భాగంగా ఎంవీ చట్టాల గురించి ప్రజలకు అవగాహన కల్పించాలని, ట్రాఫిక్ నిబంధనల గురించి తెలియజేయాలని, నిబంధనలు ఉల్లంఘించిన వారిపై, డ్రంక్ అండ్ డ్రైవ్ చేసిన వారిపై కేసులు నమోదు చేయాలన్నారు. గంజాయి అక్రమరవాణాను అరికట్టేందుకు ఆకస్మిక తనిఖీలు నిరంతరం నిర్వహించాలన్నారు. రాయచోటి రూరల్ సీఐ వరప్రసాద్, చిన్నమండెం ఎస్ఐ సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.



రికార్డులను పరిశీలిస్తున్న జిల్లా ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు

మున్సిపాలిటీ అభివృద్ధికి ఎంపీ ల్యాడ్స్



జెండాఊపి ట్రాక్టర్లను ప్రారంభిస్తున్న మేడా రఘునాథరెడ్డి, ఆకేపాటి అమరనాథరెడ్డి, పోలా శ్రీనివాసరెడ్డి

రాజ్యసభ సభ్యుడు మేడా రఘునాథరెడ్డి

రాజంపేట టౌన్: రాజంపేట మున్సిపాలిటీ అభివృద్ధికి ప్రతి ఏడాది తన ఎంపీల్యాడ్స్ నుంచి నిధులు మంజూరు చేస్తానని రాజ్యసభ సభ్యుడు మేడా రఘునాథరెడ్డి తెలిపారు. పట్టణంలోని మున్సిపల్ కార్యాలయ సభాభవనంలో శుక్రవారం మున్సిపల్ చైర్మన్ పోలా శ్రీనివాసరెడ్డి నేతృత్వంలో నిర్వహించిన మున్సిపల్ కౌన్సిల్ సమావేశంలో మేడా రఘునాథరెడ్డి, ఎమ్మెల్యే ఆకేపాటి అమర్‌నాథరెడ్డి ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈసందర్భంగా మేడా మాట్లాడుతూ మున్సిపాలిటీలో ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు ఎంపీ ల్యాడ్స్ కేటాయించాల్సిందిగా చైర్మన్ కోరారని, అందువల్ల రూ.20 లక్షల ఎంపీ ల్యాడ్స్‌తో చెత్తను డంప్‌యార్డ్‌కు తరలించేందుకు రెండు కొత్త ట్రాక్టర్లు కొనుగోలు చేసి ఇచ్చినట్లు తెలిపారు. పట్టణం పరిశుభ్రంగా ఉన్నప్పుడే కొన్ని వ్యాధులు దరిచేరవన్నారు. ఇక రాబోయేది వర్షాకాలం అని అందువల్ల మున్సిపల్ అధికారులు పట్టణంలో పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టిసారించాలని ఆదేశించారు. ఈ సందర్భంగా హిందు శ్మశాన వాటిక అభివృద్ధికి ఎంపి ల్యాడ్స్ మంజూరు చేయాలిన శ్మశానవాటిక కమిటి ప్రతినిధులు రాజ్యసభ సభ్యుడు మేడా రఘునాధ్‌రెడ్డికి వినతిపత్రం ఇచ్చారు. ఇందుకు మేడా స్పందించి నిధులు కేటాయిస్తానన్నారు. ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి నిధుల ద్వారా క్రైస్తవ శ్మశాన వాటికను కూడా అభివృద్ధి చేయనున్నట్లు తెలిపారు. అనంతరం ట్రాక్టర్లను మేడా రఘునాథరెడ్డి, ఆకేపాటి అమర్‌నాథరెడ్డి, పోలా శ్రీనివాస్‌రెడ్డి జెండా ఊపి ప్రారంభించారు.


మూలాలను మరవకూడదు:ఎమ్మెల్యే ఆకేపాటి

వైఎస్సార్ సీపీకి చెందిన కొంతమంది మున్సిపల్ కౌన్సిలర్లు మూలాలను మరచి వ్యవహరిస్తున్నారని అది సరి కాదని ఎమ్మెల్యే ఆకేపాటి అమరనాథరెడ్డి తెలిపారు. వైఎస్సార్ సీపీ కౌన్సిలర్లు తమకు బీఫాం ఎవరు ఇచ్చారు?, ఏ పార్టీ గుర్తుపై గెలిచాము అన్న విషయాలను మరచి ప్రత్యర్థి పార్టీ వారితో స్వరం కల్పడం ఏమిటని ప్రశ్నించారు. చిన్న చిన్న సమస్యలను భూతద్దంలో చూడకుండా పట్టణాభివృద్ధికి కృషి చేయాలన్నారు.

- మున్సిపాలిటి అభివృద్ధే ధ్యేయమని మున్సిపల్ చైర్మన్ పోలా శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. ఎంపీ ల్యాడ్స్ ద్వారా హిందూ, ముస్లిం, క్రైస్తవ శ్మశాన వాటికలకు ప్రహరీగోడ నిర్మాణం వంటివి పూర్తయ్యాక మున్సిపాలిటీ ద్వారా విద్యుత్, బోరు వంటి సౌకర్యాలు కల్పించనున్నట్లు తెలిపారు.

కందిపప్పూ కరువే

- కూటమి సర్కార్ వచ్చిన తర్వాత రేషన్ సరుకుల్లో కోత
- గతంలో బియ్యం, చక్కెర, కందిపప్పు, జొన్నలు , రాగులు అందించిన జగన్ సర్కార్
- కూటమి ప్రభుత్వ తీరుపై ప్రజాగ్రహం



సాక్షి రాయచోటి: కూటమి సర్కార్ అధికారంలోకి వచ్చిన తర్వాత రేషన్ సరుకులకు కోత పడుతోంది. ప్రభుత్వం కుదిస్తుందో లేక కార్డుదారులకు నిత్యావసరాలు అవసరం లేదనుకున్నారో ఏమో తేలియదుగానీ నిత్యావసర సరుకుల విషయంలో మాత్రం వాత తప్పడం లేదు. వైఎస్సార్ సీపీ సర్కార్ హయాంలో ఎప్పుడూ సామాన్య, పేద, మధ్యతరగతి ప్రజలకు సంబంధించి నాణ్యమైన సరుకులతోపాటు చక్కెర, కందిబేడలు, బియ్యం, జొన్నలు, రాగులు అందించే పరిస్థితి కనిపించేది. అయితే కూటమి సర్కార్ అధికారంలోకి వచ్చిన తర్వాత కందిపప్పు ధర పెరగడంతోపాటు విపరీతమైన డిమాండ్ ఏర్పడింది. ఈ నేపథ్యంలో సబ్సిడీపై అందించకుండా కోత పెడుతున్నారని వినియోగదారులు వాపోతున్నారు. జిల్లాలో సుమారు 5,04,325 కార్డుదారులు ఉన్నారు.

నాలుగు నెలలుగా కనిపించని కందిపప్పు

జిల్లాలో దాదాపు నాలుగు నెలలుగా కందిపప్పు కనిపించడం లేదు. అధిక మొత్తంలో ధర పలుకుతుండగా, ఇలాంటి తరుణంలో సామాన్య, మధ్యతరగతి ప్రజలకు సబ్సిడీపై అందించాల్సి ఉంది. అయితే కందిపప్పు మార్చితోపాటు ఫిబ్రవరి నెలలోనూ అందించలేదని చెబుతున్నారు. ఒకనెలకు సంబంధించి కందిపప్పు జిల్లాకు 495 మెట్రిక్ టన్నులకు పైగా అవసరం ఉంటుంది. సరుకు రవాణా కాకకపోవడంతో కందిపప్పుకు ప్రభుత్వం ఎసరు పెట్టింది.జిల్లాలోని కార్డుదారులకు పూర్తిగా నిలిపివేయగా, అంగన్వాడీ కేంద్రాలకు మాత్రం అందించారు.

పేదల కడుపు కొడుతున్న కూటమి సర్కార్

కూటమి సర్కార్ పేదల కడుపు కొడుతోంది. సుమారు నాలుగు నెలలుగా కందిపప్పు అందించడం లేదు. కూలీ, నాలీ చేసుకుంటూ...పనులకు వెళుతున్న చాలామంది వినియోగదారులు వీటిని అందిస్తారని ఆశలు పెట్టుకున్నారు. మార్కెట్‌లో ఎక్కువ రేటు ఉండడంతో కొనుగోలు చేయాలంటే ఆందోళనతో పప్పుచేయడమే మానేస్తున్నారు. కూటమి సర్కార్ అధికారంలోకి వచ్చిన తర్వాత ఎందుకు వాటిని సరఫరా చేయడం లేదో అంతు చిక్కడం లేదు.

» బియ్యం, చక్కెరతోనే సరి

జిల్లాలోని కార్డుదారులకు బియ్యంతోనే సరిపుచ్చుతున్నారు. కొంతకాలంగా చక్కెర కూడా అంతంతమాత్రంగానే సరఫరా కాగా, కందిపప్పు అసలే రాలేదు.ఎన్‌డీఏ సర్కార్ కేవలం బియ్యం, చక్కెరతోనే సరిపెడుతోంది. ఇటీవల మహాశివరాత్రి , రంజాన్, ఉగాది, శ్రీరామనవమి పండుగల సందర్భంగా కూడ కందిపప్పు అందించకపోవడంపై కార్డుదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఒకవైపు సరుకుల కోత, మరోవైపు సక్రమంగా ఇళ్లకు సరఫరా కాక వినియోగదారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

క్లుప్తంగా

చెట్టును ఢీకొన్న లారీ

అట్లూరు : మండలంలోని కడప–బద్వేల్ రహదారిపై కలివికోడి పరిశోధనా కేంద్రం సమీపంలో ఓ లారీ అదుపు తప్పి చెట్టును ఢీకొంది. స్థానికుల వివరాల మేరకు.. గురువారం రాత్రి కడప వైపు నుంచి వెళ్తున్న లారీ అట్లూరు పోలీస్ స్టేషన్ సమీపం లోని కలివికోడి పరిశోధనా కేంద్రం వద్దకు చేరగానే.. అదుపు తప్పి రోడ్డుకు ఆవల ఉన్న వేప చెట్టును ఢీకొంది. రాత్రి సమయంలో వాహనాలు రాకపోవడంతో డ్రైవర్‌కు పెను ప్రమాదం తప్పింది. మద్యం మత్తులో లారీ నడిపినట్లు స్థానికులు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు



తీవ్రంగా గాయపడిన సుధీర్, మహేష్

బద్వేలు అర్బన్ : నెల్లూరు జిల్లా కదిరినాయుడు పల్లె సమీపంలో శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇరువురు బద్వేల్ వాసులకు తీవ్రగాయాలయ్యాయి. మున్సిపాలిటీ పరిధిలోని వల్లెరవారి పల్లెకు చెందిన సుధీర్, బ్రాహ్మణ వీధికి చెందిన మహేష్ పిపి.కుంట సమీపంలోని సెంచరీ పానెల్స్ పరిశ్రమలో పనిచేస్తున్నారు. శుక్రవారం ఓ పని నిమిత్తం తమ స్కూటీలో నెల్లూరుకు వెళ్లి తిరిగి వస్తుండగా కదిరినాయుడుపల్లె సమీపంలోని వంతెన వద్ద అదుపుతప్పి కిందపడ్డారు. ఈ ఘటనలో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు కడప రిమ్స్‌కు తరలించారు.

కోర్టు సముదాయంలో భద్రతపై సెక్యూరిటీ ఆడిట్



కడప కోర్టును పరిశీలిస్తున్న పోలీసు అధికారులు

కడప అర్బన్ : కడప నగరంలోని జిల్లా కోర్టు సముదాయంలో భద్రతా చర్యలపై స్టేట్ ఇంటెలిజెన్స్, పోలీస్, అగ్నిమాపక అధికారులు సెక్యూరిటీ ఆడిట్ నిర్వహించారు. భవన సముదాయంలో ఎలాంటి పరిస్థితులనైనా దీటుగా ఎదుర్కొనేందుకు చేపట్టాల్సిన చర్యలపై చర్చించారు. సీసీ కెమెరాలు, ఫైర్ సేఫ్టీ, ఇతర చర్యల నిమిత్తం కోర్టు ఆవరణంతా పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఇంటెలిజెన్స్ డీఎస్పీ వై.సాయిరాం, స్టేట్ టెక్నికల్ సర్వీసెస్ సీఐ సుదర్శన్‌రెడ్డి, కడప డీఎస్పీ పి.వెంకటేశ్వర్లు, ఎస్.వినయ్‌కుమార్‌రెడ్డి, ఆర్.పురుషోత్తం రాజు, బసివిరెడ్డి, జీవన్‌రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.



ఇంటిని కదపక.. చెట్టును తీయక

మనిషిని కాపాడుకుందాం...కానీ ఓ చెట్టును కాపాడుకునే ప్రయత్నం చేయం. కానీ ఈ ఇంటిలోని వ్యక్తులు పర్యావరణాన్ని కాపాడుకునేందుకు గట్టి ప్రయత్నాలు చేస్తున్నారు. ఇంటిలోనుంచి చెట్టు ఎటు వెళ్లినా దాన్ని కాపాడుకునేందుకు కృషి చేస్తున్నారు. ఎన్ని వంపులు తిరిగినా చెట్టును ధనంగా భావించి నిలుపుకుంటున్నారు. కడప నగరం నాగరాజుపేట గుండాచారి హైస్కూల్ వద్ద ఓ ఇంట్లో కనిపించిన దృశ్యాలు సాక్షి కెమేరాకు చిక్కాయి. – ఫొటోగ్రాఫర్, సాక్షి, కడప



కోడి కత్తితో అన్నావదినలపై దాడి



దాడిలో గాయపడిన ఎర్రప్ప, శ్యామల

నిమ్మనపల్లె : అన్నదమ్ముల మధ్య వ్యక్తిగత కక్షలు కత్తులతో దాడి చేసుకునే వరకూ దారి తీశాయి. మాటామాటా పెరిగి క్షణికావేశంలో కోడి కత్తితో సొంత తమ్ముడే.. అన్నా, వదినలపై దాడికి దిగారు. తీవ్రగాయాలతో వారు ఆస్పత్రి పాలయ్యారు. బాధితుల వివరాల మేరకు.. చిత్తూరు జిల్లా చౌడేపల్లి మండలం బోయకొండ పంచాయితీ యానాది కాలనీకి చెందిన ఎర్రప్ప(30), శ్యామల(24) నిమ్మనపల్లె మండలం బండ్లపై పంచాయతీ దుర్గంవారి పల్లె వద్ద వ్యవసాయ పనులు చేసుకుంటూ జీవిస్తున్నారు. ఎర్రప్పకు గత కొద్ది రోజులుగా తమ్ముడు హనుమంతుతో వ్యక్తిగత వివాదాలున్నాయి. ఈ క్రమంలో శుక్రవారం సాయంత్రం ఎర్రప్ప తన భార్య శ్యామలతో కలిసి సొంత పనులపై బండ్లపై గ్రామానికి వచ్చారు. తిరిగి రాత్రి సుమారు ఎనిమిది గంటల సమయంలో దుర్గంవారిపల్లె పొలం వద్దకు వెళ్తున్నారు. తన అన్న వచ్చిన విషయం తెలుసుకున్న మార్గమధ్యంలో శివాలయం వద్ద ఎర్రప్ప తమ్ముడు హనుమంతు, తన స్నేహితుడు అశోక్, మరో వ్యక్తితో కలిసి వాహనాల్లో దారి కాచారు. ఎర్రప్ప రాగానే అడ్డగించి కోడి కత్తులతో అన్నా, వదినలపై విచక్షణా రహితంగా దాడి చేసి హత్యాయత్నానికి పాల్పడ్డారు. ఎర్రప్ప భార్యకు తీవ్ర గాయాలవడంతో స్థానికుల సాయంతో పిట్టావాండ్లపల్లెలో ప్రాథమిక చికిత్స చేయించుకుని 108 వాహనంలో మదనపల్లి ప్రభుత్వ జిల్లా ఆసుపత్రికి తరలించారు. భార్య, భర్తల పరిస్థితి విషమంగా ఉన్నట్లు వైద్యులు తెలిపారు. మదనపల్లె రూరల్ సర్కిల్ సీఐ సత్యనారాయణ, నిమ్మనపల్లె ఎస్సై తిప్పేస్వామి సంఘటనా స్థలానికి చేరుకుని విచారించారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు రూరల్ సర్కిల్ సీఐ సత్యనారాయణ తెలిపారు.

ఇద్దరు ఏఆర్ కానిస్టేబుళ్ల సస్పెన్షన్

- ఓ యువతి ఆత్మహత్య కేసులో నిందితుడిగా భావిస్తూ ఒకరు
- అవినీతికి పాల్పడ్డారనే ఆరోపణలపై మరొకరు

సాక్షి టాస్క్‌ఫోర్స్ : కడప ఏఆర్ విభాగంలో విధులు నిర్వహిస్తున్న ఇద్దరు కానిస్టేబుళ్లపై పోలీసు అధికారులు సస్పెన్షన్ వేటు వేశారు. యువతుల ఫొటోలు తీసి బ్లాక్‌మెయిల్‌కు పాల్పడడిప ఒకరిపి. డబ్బు వసూళ్లు, అవినీతి ఆరోపణల నేపథ్యంలో మరొకరిపై విచారించిన ఆ శాఖ ఉన్నతాధికారులు ఇద్దరిని సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు ఇచ్చారు. వివరాల మేరకు.. అన్నమయ్య జిల్లా మన్నూరు పోలీస్‌స్టేషన్ పరిధిలో గత ఫిబ్రవరిలో ఓ యువతి ఆత్మహత్యకు పాల్పడింది. కడప ఏఆర్ విభాగం డాగ్ స్క్వాడ్ విభాగంలో పనిచేస్తున్న కానిస్టేబుల్ రామ్మోహన్‌రెడ్డి బంధువు అనిల్‌కుమార్‌రెడ్డి కడప నగర శివారులోని పాలకొండలు, ఇతర శివారు ప్రాంతాల్లో ఎవరైనా యువతీ, యువకులు ఒంటరిగా కనిపించినా వారి ఫొటోలు తీయడం, బ్లాక్‌మెయిల్‌కు పాల్పడడం చేస్తున్నారు. అనిల్‌కుమార్‌రెడ్డి ఫొటోలు తీయడం, ఆయన బంధువైన ఏఆర్ కానిస్టేబుల్ హుటాహుటిన సంఘటన స్థలానికి చేరుకుని బాధితులను బెదిరించి డబ్బు వసూలు చేయడం రోజువారీ కార్యక్రమంగా మారింది. ఈ నేపథ్యంలోనే రాజంపేటలోని ఇంజినీరింగ్ చదువుతున్న విద్యార్థిని కడప పాలకొండలుకు స్నేహితులతో పాటు విహారానికి వచ్చింది. ఆ సమయంలో అనిల్‌కుమార్‌రెడ్డి యువతి ఫొటోలు తీసి బెదిరించారు. రోజుల తరబడి వేధింపులకు గురిచేయడంతో తట్టుకోలేక ఆత్మహత్యకు పాల్పడింది. ఇదిలా ఉంటే యువతి ప్రవర్తనపై తల్లిదండ్రులకు నేరుగా ఫోన్ చేసి అనిల్‌కుమార్‌రెడ్డి దొరికిపోయాడు. యువతి తండ్రి పోలీసులకు ఫిర్యాదు ఫిర్యాదుచేయడంతో అనిల్‌కుమార్‌రెడ్డి అరెస్టు చేసి విచారించారు. అనంతరం ఏఆర్ కానిస్టేబుల్ రామోహన్‌రెడ్డి ప్రమేయం వుండడంతో అతడిని నిందితుడిగా చేర్చి అరెస్ట్ చేశారు.

అవినీతికి పాల్పడడంతో మరొకరిని...

కడప ఏఆర్ కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న సిద్ధారెడ్డి ట్రావెల్స్ నడుపుతున్నారు. చేపల చెరువు నిర్వహిస్తున్నారు. దీంతోపాటు పోలీస్ కానిస్టేబుల్ ఎంపికల్లో ఈయన అవినీతికి పాల్పడినట్లు తెలిసింది. దీంతో ఉన్నతాధికారులు విచారించి సిద్ధారెడ్డిని సస్పెండ్ చేశారు.

ఆటోను ఢీకొన్న ఆర్టీసీ బస్సు



గాయపడిన షేక్ ఇమ్రాన్, రెడ్డిబాషా

నిమ్మనపల్లె : రోడ్డు ప్రమాదంలో ఐదుగురికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికుల వివరాల మేరకు.. మదనపల్లె పట్టణం ఎగువ కురవంకలో నివాసముంటున్న షేక్ రెడ్డిబాషా శుక్రవారం తన కుటుంబసభ్యులతో కలిసి నిమ్మనపల్లెలోని సయ్యద్ షావలి దర్గా వద్ద జరిగే ఉరుసు చూసేందుకు వెళ్లాడు. అక్కడి నుంచి సింగంవారిపల్లెకు వెళ్లేందుకు చిన్నళ్లవారిపల్లెకు చెందిన పఠాన్ ముస్తఫా ఆటో బాడుగకు మాట్లాడుకుని కుటుంబసభ్యులతో బయలుదేరారు. మార్గమధ్యంలో సైదాపేట మలుపు వద్ద కందూరు వైపు నుంచి వేగంగా వచ్చిన ఆర్టీసీ బస్సు వీరు ప్రయాణిస్తున్న ఆటోను ఢీకొంది. ప్రమాదంలో రెడ్డిబాషా(46), తాజున్ బీ(40), ఇమ్రాన్(17), అసిఫా(14)తోపాటు ఆటో డ్రైవర్ ముస్తఫా(60)లకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు బాధితులను నిమ్మనపల్లె పీహెచ్‌సీకి తరలించి ప్రాథమిక చికిత్స అనంతరం మదనపల్లి ఆసుపత్రికి తరలించారు. స్థానిక పోలీసులు కేసు విచారణ చేస్తున్నారు.

ఉత్సవమూర్తులకు చక్రస్నానం



కుందూనదిలో చక్రస్నానం చేయిస్తున్న అర్చకులు

రాజుపాళెం : మండలంలోని వెల్లాల క్షేత్రంలో జరుగుతున్న బ్రహోత్సవాలలో భాగంగా తొమ్మిదో రోజున శ్రీదేవి, భూదేవి సమేత చెన్నకేశవ, సంజీవ రాయ స్వాముల విగ్రహాలను హంస వాహనంపై కొలువుదీర్చి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం వసంతం చల్లుతూ, భజన పాటలు పాడుతూ, నవ ధాన్యాల మొలకలు తీసుకొని కుందూనదికి చేరుకుని ప్రత్యేక పూజలు జరిపారు. ఉత్సవ విగ్రహాలకు స్నపనం గావించి చక్రస్నానం చేయించారు. అనంతరం అక్కడకు వచ్చిన భక్తులంతా కుందూ నదిలో స్నానం ఆచరించారు. భక్తులకు వేద పండితులు అన్నదానం ఏర్పాటు చేశారు. ఈఓ వెంకటరమణ, లక్ష్మీనారాయణరెడ్డి, రామ్మోహన్, అర్చకులు పాల్గొన్నారు.

పోలీసుల అదుపులో ఇద్దరు ఆఫ్ఘన్లు

కడప అర్బన్ : ఇద్దరు ఆఫ్ఘనిస్థాన్ దేశస్థులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. కడప నగరం వన్ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని రాజీవ్ పార్కు సమీపంలో శుక్రవారం తెల్లవారుజామున రెండు గంటల సమయంలో పోలీసులు తనిఖీలు చేశారు. ఇద్దరు గుర్తు తెలియని వ్యక్తులు అనుమానాస్పదంగా తిరుగుతుండగా పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. విచారించగా ఆఫ్ఘనిస్తాన్ దేశానికి చెందిన అసదుల్లా, ఓవాస్ అని గుర్తించారు. భారతదేశానికి వచ్చి ఐదు సంవత్సరాలు అవుతోంది. నంద్యాలలో కొంతకాలం ఉన్నారు. రెండు నెలల కిందట కడపకు వచ్చారు. ఈ క్రమంలోనే కడపలో ఐస్‌క్రీమ్ పార్లర్‌లో పనిచేస్తూ అక్రమంగా తలదాచుకుంటున్నారు. పోలీసులు ఎంబీసీకి రిపోర్టు పంపనున్నారు. తర్వాత వారి దేశానికి తరలించనున్నట్లు సమాచారం.

లారీ ఢీకొని వ్యక్తి మృతి



మృతి చెందిన కొండలరావు

పుల్లంపేట : మండల కేంద్రం వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు ప్రకాశం జిల్లా పొదిలి గ్రామానికి చెందిన కొండలరావు పుల్లంపేటలో బేల్దారి పని చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. శుక్రవారం పనులు పూర్తి చేసుకుని ఇంటికి వెళ్తున్న కొండలరావు మండల కేంద్రంలోని బైపాస్ వద్ద రోడ్డు దాటుతున్న సమయంలో కడప – చెన్నై మినీ లారీ ఢీ కొనడంతో తీవ్ర రక్త స్రావం కావడంతో అక్కడే మృతి చెందాడు. పుల్లంపేట పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

లైంగిక వేధింపులపై కేసు నమోదు

కొండాపురం : మండలంలోని పొట్టిపాడు గ్రామానికి చెందిన సింగంశెట్టి సూర్యనారాయణ అలియాజ్ పెద్దసూరి లైంగిక వేధింపుల కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ ప్రతాప్‌రెడ్డి తెలిపారు. ఎస్ఐ వివరాల మేరకు.. పొట్టిపాడు గ్రామానికి చెందిన సింగంశెట్టి సూర్యనారాయణ స్థానిక మహిళతో అసభ్యంగా మాట్లాడుతూ లైంగికంగా వేధిస్తున్నారు. ఈ విషయం ఆమె తన భర్తకు చెప్పడంతో అతడు వెళ్లి సూర్యనారాయణను మందలించాడు. దీంతో అతడు, ఆయన బంధువు తాను, తన భర్తపై దాడికి యత్నించారని సదరు మహిళ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

డెంగీ నిర్మూలనకు కృషి చేద్దాం



ర్యాలీ ప్రారంభిస్తున్న డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌ఓ చిన్నికృష్ణ

రాజంపేట రూరల్ : పట్టణ, గ్రామ స్థాయిలో డెంగీ వ్యాధి నిర్మూలనకు సమష్టిగా కృషి చేద్దామని డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌ఓ డాక్టర్ చిన్ని కృష్ణ పిలుపునిచ్చారు. స్థానిక ఏరియా వైద్యశాలలో శుక్రవారం జాతీయ డెంగీ దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ చిన్నికృష్ణ మాట్లాడుతూ ఆకస్మికంగా జ్వరం రావడం, తలనొప్పి, విపరీతంగా కండరాలు, కీళ్లు, కాళ్ల నొప్పులు రావడం, చర్మంపై ఎర్రటి దద్దులు రావడం వంటి లక్షణాలు కనిపిస్తే ఆస్పత్రి వైద్యులను సంప్రదించాలన్నారు. ప్రతి శుక్రవారం ఫ్రైడే డ్రైడే కార్యక్రమం నిర్వహించి జ్వరాలు ఎలా ప్రబలుతాయో ప్రజలకు అవగాహన కల్పించాలని సిబ్బందిని ఆయన ఆదేశించారు. అనంతరం ఆసుపత్రి నుంచి పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సూపరింటెండెంట్ డాక్టర్ పళని వేంకటనాగేశ్వర రాజు, సానే శేఖర్, వికాస్, లక్ష్మీ ప్రసన్న, అశోక్, స్నేహ, ఎస్ఎస్.దాస్, పిల్లి జయ ప్రకాష్, తదితరులు పాల్గొన్నారు.

అధికారుల అరెస్టులు అప్రజాస్వామికం

- కక్షపూరిత రాజకీయాలు సరైనవి కావు
- వైఫల్యాలను కప్పించుకునేందుకే డైవర్షన్ పాలిటిక్స్
- రాజ్యసభ సభ్యుడు మేడారఘునాథరెడ్డి ఆగ్రహం



రాజంపేట : గత ప్రభుత్వ పాలనలో పనిచేసిన మాజీ ఐఏఎస్ అధికారి ధనుంజయరెడ్డి, మాజీ ప్రభుత్వాధికారి కృష్ణమోహన్‌రెడ్డి అరెస్టు అప్రజాస్వామికమని రాజ్యసభ సభ్యుడు మేడా రఘునాథరెడ్డి అన్నారు. శుక్రవారం ఆయన 'సాక్షి'తో మాట్లాడారు. చంద్రబాబు కక్షపూరిత రాజకీయలు చేస్తుండడంతో వ్యవస్థలు దెబ్బతింటున్నాయన్నారు. తప్పుడు కేసులు పెట్టి తప్పుడు సాక్ష్యాలు, వాంగ్మూలాలు సృష్టిస్తూ ప్రభుత్వాధికారులను, మాజీ ప్రభుత్వాధికారులపై రాజకీయవిరోధం చూపిస్తున్నారన్నారు. లిక్కర్ వ్యవహారంలో బెదిరించి, భయపెట్టి తప్పుడు వాంగ్మూలాలు తీసుకొని అరెస్టు చేస్తున్నారన్నారు. పాలనా వైఫల్యాలను కప్పిపుచ్చుకొనేందుకు డైవర్షన్ పాలిట్రిక్స్ చేస్తున్నారన్నారు. రెడ్ బుక్ రాజ్యాంగంలో ఉన్నతాధికారులను బలిచేయడం చూస్తుంటే, ప్రభుత్వ ఆరాచక పాలన స్పష్టం అవుతోందన్నారు. ఇంకా కొనసాగితే ప్రజలు సహించరన్నారు. భవిష్యత్తులో ఇందుకు తగిన మూల్యం చెల్లించుకునే పరిస్థితులు ఉత్పన్నమవుతాయని స్పష్టంచేశారు.

రేణుకా ఎల్లమ్మ గుడిలో చోరీ



హుండీని పరిశీలిస్తున్న సీఐ, ఎస్ఐలు

వీరబల్లి : మండలంలోని మట్లిపెద్దూరు కస్పాలోని రేణుకా ఎల్లమ్మ గుడిలో గురువారం రాత్రి చోరీ జరిగినట్లు స్థానికులు తెలిపారు. శుక్రవారం తెల్లవారుజామున స్థానికులు కొందరు ఈ సంఘటనను గుర్తించి సీఐ వరప్రసాద్, ఎస్ఐ మోహన్‌నాయక్‌కు తెలియజేశారు. వారు చేరుకుని సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. హుండీ పగులగొట్టి పొలాల్లో పడేసి వెళ్లారని, రూ.50 వేల నగదు ఉంటుందని స్థానికులు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ఏపీజీఈఏ జిల్లా అధ్యక్షుడిగా లక్ష్మీప్రసాద్



రాయచోటి టౌన్ : అన్నమయ్య జిల్లా ఏపీజీఈఏ(ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం) అధ్యక్షుడిగా రాయచోటి ప్రభుత్వ ఏరియా ఆస్పత్రి డాక్టర్ లక్ష్మీప్రసాద్‌రెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఆయన తెలిపారు. ఈ ఎన్నికకు కడప జిల్లా అధ్యక్షుడు రఘురాంనాయుడు, రాష్ట్ర జాయింట్ సెక్రటరీ కృష్ణ ప్రసాద్ ఎన్నికల పరిశీలకులుగా వ్యవహరించారు. ఈ ఎన్నికలు బుధవారం నిర్వహించగా రాష్ట్ర అధ్యక్షుడి నుంచి అధికారకంగా శుక్రవారం వెలువడ్డాయి.

వాహనం బోల్తా.. ఒకరి మృతి

తాడిపత్రి : మండలంలోని ఇగుడూరు గ్రామం వద్ద బొలెరో లగేజీ వాహనం బోల్తా పడిన ఘటనలో ఒకరు మృతిచెందారు. మరో ముగ్గురు గాయపడ్డారు. పోలీసులు తెలిపిన మేరకు... వైఎస్సార్ జిల్లా ప్రొద్దుటూరుకు చెందిన కొందరు కర్ణాటక ప్రాంతంలో కొనుగోలు చేసిన జీవాలను బొలెరో లగేజీ వాహనంలో ఎక్కించుకుని తిరుగుప్రయాణమయ్యారు. శుక్రవారం ఇగుడూరు గ్రామం వద్దకు చేరుకోగానే టైర్ పేలడంతో వాహనం అదుపు తప్పి రహదారిపై బోల్తాపడింది. ఘటనలో ప్రొద్దుటూరుకు చెందిన చాంద్ బాషా (45) అక్కడికక్కడే మృతి చెందాడు. షేక్ హుస్సేన్ బాషా, ఎర్రగుంట్లకు చెందిన ఆంజనేయులు, గంగప్రతాప్ గాయపడ్డారు. ఘటనపై రూరల్ పీఎస్ సీఐ శివగంగాధరరెడ్డి కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

43 దిమ్మెలు కూల్చిన ఆకతాయిలు



విరిగిన దిమ్మెలను చూపిస్తున్న రైతు రమణారెడ్డి

ఓబులవారిపల్లె : మండలంలోని పున్నాటివారిపల్లి సమీపంలో రైతు ఓబులిబస్సు గారి రమణారెడ్డికి చెందిన వ్యవసాయ భూమి కంచెను ఆకతాయిలు తొలగించారు. ఉదయం చేను వద్దకు వెళ్లి చూడగా కంచె అమర్చిన 43 సిమెంటు స్తంభాలు విరగగొట్టి ఉండడం గమనించి పోలీసులను ఫిర్యాదు చేశారు. తనకు న్యాయం చేయాలని రైతు కోరారు. ఎస్ఐ రమణ వ్యవసాయ భూమిని పరిశీలించారు.

13 మంది తహసీల్దార్లకు షోకాజ్ నోటీసులు

కడప సెవెన్‌రోడ్స్ : అసైన్డ్ భూముల ఫ్రీ హోల్డ్ విషయంలో నిబంధనలు అతిక్రమించారని జిల్లాలోని 13 మంది తహసీల్దార్లకు షోకాజ్ నోటీసులు జారీ అయ్యాయి. గతంలో 20ఏళ్ల కాలపరిమితితో అసైన్డ్ భూములపై రైతులకు యాజమాన్య హక్కులు కల్పిస్తూ చట్ట సవరణలు చేసిన విషయం తెలిసిందే. అసైన్డ్ భూములను ఫ్రీ హోల్డ్ చేయడంలో అవకతవకలు చోటుచేసుకున్నాయనే ఆరోపణలు రావడంతో జిల్లా రెవెన్యూ యంత్రాంగం విచారించింది. అప్పట్లో ఆయా మండలాల్లో పనిచేసిన తహసీల్దార్లకు షోకాజ్ నోటీసులు జారీ చేసింది. అప్పట్లో తహసీల్దార్లుగా పనిచేసిన అనూరాధ(మైదుకూరు), వి.గంగయ్య(పోరుమామిళ్ల) మధుసూదన్‌రెడ్డి(బద్వేల్), విజయకుమారి(వీఎన్‌పల్లె), లక్ష్మీనారాయణ(లింగాల), మహబూబ్ బాషా(సింహాద్రిపురం), గుర్రప్ప(జమ్మలమడుగు), ఉదయభాస్కర్‌రాజు(పెండ్లిమర్రి), సువర్ణ(బి.మఠం), సరస్వతి(కమలాపురం) రామచంద్రుడు(కాశినాయన), వెంకటసుబ్బయ్య(వేముల), శంకర్ రావు(వల్లూరు)లు షోకాజ్ నోటీసులు అందుకున్న వారిలో ఉన్నారు. ప్రధానంగా మైదుకూరు, లింగాల, బి.మఠం, జమ్మలమడుగు మండలాల్లో భారీగా అవకతవకలు జరిగినట్లు తెలిసింది.

పట్టుపట్టి.. ర్యాంకులు కొట్టి

ఏపీ ఈసెట్‌లో విద్యార్థుల ప్రతిభ

కడప ఎడ్యుకేషన్ : తల్లిదండ్రుల కష్టాలను చూసిన విద్యార్థులు తమ లక్ష్యం ఎంచుకున్నారు. కష్టపడి చదివి తమ కలలు సాకారం చేసుకునే దిశగా అడుగులు వేస్తున్నారు. ఏపీ ఈసెట్ పరీక్ష ఫలితాలు గురువారం వెలువడగా జిల్లా విద్యార్థులు ర్యాంకులు సాధించి భళా అనిపించారు. ఇంజినీరింగ్ చదివి తల్లిదండ్రుల కష్టం తీరుస్తామని చెబుతున్నారు.

సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ కావాలని..



తొండూరు మండలం క్రిష్ణంగారిపల్లెకు చెందిన సురేష్‌రెడ్డి కుమార్తె పల్లెటి రాజశ్రీ ఏపీ ఈసెట్‌లో ఐదో ర్యాంకు సాధించారు. ఈమె తండ్రి పులివెందుల మెడికల్ కళాశాలలో ఆరోగ్యమిత్రగా పనిచేస్తుండగా, తల్లి అంగన్‌వాడీ టీచర్‌గా ఉంది. రాజశ్రీ ఒకటో తరగతి నుంచి పదో తరగతి వరకు పలివెందులలో చదివారు. పులివెందుల లయోలా కళాశాలలో పాలిటెక్నిక్ సీఎస్‌సీ పూర్తి చేశారు. ఈసెట్ రాసి ఐదో ర్యాంకు సాధించారు. మంచి కంపెనీలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం సంపాదించడమే తన లక్ష్యమని విద్యార్థిని తెలిపారు.

రైతు కుమారుడు చదువులో మెరిసె..




ఖాజీపేట కొటంగురువారిపల్లెకు చెందిన మారుతి శ్రీనివాసులు వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. ఈయన సతీమణి నాగలక్ష్మికళ ప్రైవేట్ టీచర్‌గా పనిచేస్తున్నారు. వీరి కుమారుడు తరుణ్ ఏపీ ఈసెట్‌లో రాష్ట్రస్థాయిలో ఆరో ర్యాంకు సాధించాడు. తల్లిదండ్రుల కష్టాన్ని గుర్తించిన తరుణ్ కష్టపడి చదివాడు. తిరుపతి ఎస్వీ కాలేజీలో డీఫార్మసీ పూర్తి చేశారు. ఏపీ ఈసెట్‌లో ఆరో ర్యాంకు సాధించారు. కొలువు సాధించమే లక్ష్యం అని చెబుతున్నారు.

తల్లిదండ్రుల కష్టాన్ని గుర్తించా..



తమ తల్లితండ్రులు పడుతున్న కష్టాన్ని కళ్లారా చూసిన గణేష్ కష్టపడి చదివి ఏపీ ఈసెట్‌లో రాష్ట్ర స్థాయిలో ఆరో ర్యాంకు సాధించాడు. వేంపల్లి మండలం ముత్తకూరు గ్రామానికి చెందిన గంగరాజు, గంగాభవానీలు వ్యవసాయం చేస్తూ కుమారుడిని చదివించారు. గణేష్ పులివెందుల లయోలా పాలిటెక్నిక్ కళాశాలలో మైనింగ్‌పూర్తి చేశాడు. తల్లిదండ్రుల కష్టాలు తీర్చాలని చదివి ఏపీ ఈసెట్ రాశారు. ఆరో ర్యాంకు సాధించి భళా అనిపించాడు. మంచి కొలువు సాధించి తల్లిదండ్రుల కష్టాన్ని తీర్చాలన్నదే తన లక్ష్యమన్నారు.

బేల్దారి కుమారుడు ర్యాంకు సాధించాడు



జమ్మలమడుగు మండలం పెద్దగండ్లూరుకు చెందిన చెన్నారెడ్డి బేల్దారి పని చేస్తున్నారు. తల్లి శివపార్వతి గృహిణి. వీరి కుమారుడు గువ్వల జయచంద్రారెడ్డి రాష్ట్ర స్థాయిలో పదో ర్యాంకు సాధించాడు. చిన్నప్పటి నుంచి తల్లిదండ్రులకు చేదోడు వాదోడుగా ఉంటున్న జయచంద్రారెడ్డి వారి కష్టాలు గుర్తించాడు. కష్టపడి చదివి ఏపీ ఈసెట్‌లో రాష్ట్రస్థాయిలో పదో ర్యాంకు సాధించాడు. కొలువు సాధించి తల్లిదండ్రులకు ఆసరాగా నిలుస్తానని చెప్పారు.